# రైతాంగాన్ని సామ్రాజ్యవాదులకు బడా బూర్జువాలకు ఎరగా వేసే కేంద్ర ప్రభుత్వ మరో దుష్ట పన్నాగం

అలోక్ ముఖర్జీ

**బడా** బూర్జువాలలోని, సామ్రాజ్యవాదులలోని ఒక విభాగం ప్రస్తుత కేంద్రప్రభుత్వానికి అత్యంత విశ్వాసపాత్రులైన సేవకుల్లా వున్నారు. తాము ముందుకు తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు తీవ్ర రైతాంగ, ప్రజానిరసనను ఎదుర్కొంటాయని మోడీ-షాల ద్వయానికి చాలా బాగా తెలుసు. ఇది వారి 'పథకం మొదటిది'. దాదాపు ఢిల్లీని దిగ్బంధం చేసిన తరహాలో ఒక సంవత్సరకాలం పైగా సాగిన భారీ రైతాంగ నిరసన మోడీ ప్రభుత్వ మెడలు వంచేట్లు చేసి, ఎత్తుగడగానైనా కొంతకాలం వెనక్కు తగ్గేట్లు చేసింది. అయితే ఇప్పుడు వారికి మరో పథకం సిద్ధంగా వుంది. గత సంవత్సరమే దీనిని బడ్జెట్‌లో ప్రవేశపెట్టి, దొంగచాటుగా ఆమోదం పొందారు. 2023-24 సం॥నికి పదివేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటుచేసి, అభివృద్ధి చేయాలనేది రెండో పథకం.

ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు కోసం కేటాయింపును 100 శాతం అనగా 500 కోట్ల రూ॥కు పెంపుచేయగా, రైతాంగానికి కనీస మద్దతు ధర కల్పించేందు కోసమంటూ పెద్దఎత్తున ప్రచారం చేసుకునే "ప్రధానమంత్రి - అన్నదాత సంరక్షణ్ అభియాన్"కు హాస్యాస్పదంగా ఒక కోటి రూ॥ మాత్రమే కేటాయించారు.

ప్రభుత్వం రుద్దిన వ్యవసాయ చట్టాలను రైతాంగ ఉద్యమం శక్తివంతంగా వెనక్కుగొట్టిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం ఈ రెండో పథకంతో వేగంగా ముందుకు సాగుతున్నది. "చిన్న, సన్నకారు రైతాంగాన్ని" అభివృద్ధి చేసే పేరుతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని చెబుతున్నారు. రెండున్నర ఎకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమి కలిగిన పేద, దిగువ మధ్యతరగతి రైతాంగాన్ని సమీకరిస్తున్నారు. ఉత్పత్తిదారులంటూ వారి వర్గ లక్షణాన్ని మరుగుపరిచే విధంగా పాలకవర్గాలు, వారి అనుంగు మేధావులు కొత్తకొత్త పథకాలను ప్రయోగిస్తున్నారు. వీరితో 'రైతు ఉత్పత్తిదారుని సంస్థలు' (ఎఫ్‌పిఓలను) నిర్మాణం చేయటం ప్రారంభించారు. ఈ పన్నాగం యొక్క వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం దీని కొరకు రూపొందించిన మార్గదర్శక సూత్రాలను మన పరిశీలన కోసం చూడవచ్చు.

ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలలోని 4.4 పేరాలో ఇలా పేర్కొన్నారు : "దాదాపు ఒకే ప్రయోజనం పొందుతూ ఒక ప్రాంతంలో నివసించే 15-20 మంది రైతులతో ఒక సమూహాన్ని ఏర్పరుస్తారు; ఇలాంటి 20 లేదా అంతకంటే ఎక్కువ సమూహాలు కలిసి ఒక ఉత్పత్తి విభాగంగా, గ్రామ లేదా పొరుగు గ్రామాలకు చెందిన సమూహాలను కలిపి ఒక ఎఫ్‌పిఓగా ఏర్పరుస్తారు. మైదాన ప్రాంతాలలోని ఎఫ్‌పిఓలలో మొత్తం రైతాంగ సభ్యుల కనీస సంఖ్య 300 మందికి తగ్గకుండా వుంటేనే ఈ పథకానికి అర్హులౌతారు. అదే కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలలో 7, 8 రైతాంగ సమూహాలతో కనీసం వంద మంది రైతాంగ సభ్యులతో ఎఫ్‌పిఓను ఏర్పరచవచ్చు".

సగటున 2 ఎకరాల వ్యవసాయ భూమి కలిగివున్న 300 మంది రైతులతో, ఎఫ్‌పిఓ ఏర్పడితే, వీరందరికీ కలిపి 600 ఎకరాల భూమి వుంటుంది. ఇలాంటి 10 వేల ఎఫ్‌పిఓల ఆధ్వర్యంలో 60 వేల ఎకరాల భూమి ఉంటుంది. మార్గదర్శక సూత్రాల్లోని 2వ పేరా పేద రైతాంగం గురించి స్పష్టంగా పేర్కొంది. పేద రైతాంగంతో ఏర్పడిన ఎఫ్‌పిఓలన్నీ కంపెనీ చట్టం పార్ట్ '9ఏ' ప్రకారం గానీ, లేదా సంబంధిత రాష్ట్రాల సహకార సొసైటీల చట్టం ప్రకారంగానీ రిజిస్టర్ అయి వుండాలి. రైతాంగాన్ని పూర్తిగా నియంత్రణలో వుంచుకునేందుకు సహకార సొసైటీల చట్ట ప్రకారం రిజిస్టర్ అయిన ఎఫ్‌పిఓలు, రోజువారీ యాజమాన్యం నుండి, ఎన్నికల క్రమంతో సహా అన్ని విధాలైన జోక్యాన్నుండి తప్పనిసరిగా వేరుపడి వుండాలి. కనుక ఎఫ్‌పిఓలన్నీ కేంద్ర ప్రభుత్వం నియమించిన ఏజన్సీల అధీనంలో నడపబడుతూ, నిర్వహింపబడుతూ వుంటాయి. వాస్తవానికి ఎఫ్‌పిఓలను నడపటం, నిర్వహించ టమనేది ఉన్నత స్థాయి నుండి ఆధిపత్యం చెలాయించే అనేక దొంతరల సంక్లిష్ట స్వభావాన్ని కలిగివుండి సాధారణ రైతాంగం అర్థం చేసుకోవటం కూడా కష్టసాధ్యమయ్యే విధంగా వుంది. దిగువ నుండి పైస్థాయి దొంతరల ఏర్పాటును పరిశీలిద్దాం.

ఎఫ్‌పిఓ గురించి మొదటే ప్రస్తావించుకున్నాం. 15-20 మంది రైతుల సమూహాలు ఒకటిగా కూడి, కనీసం 300 మంది రైతులతో ఒక ఎఫ్‌పిఓగా ఏర్పడతారు. ఎఫ్‌పిఓల కార్యకలాపాలను జీతభత్యాలు పొందే ఉన్నతాధికారులు, అకౌంటెంట్స్ నిర్వహిస్తారు. తరువాతి దొంతర క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్స్ (సిబిబిఓలు) క్లస్టర్ ఏరియా ఉత్పత్తిపై ఆధారపడి ఎఫ్‌పిఓలు ఏర్పడతాయి. వ్యవసాయం, అనుబంధ ఉత్పత్తులతోపాటు ఒక భౌగోళిక ప్రాంతంలో అదే తరహా ఉద్యానవన పంటలు సాగుచేసేవిగా ఎఫ్‌పిఓలు వుంటాయి. సేంద్రియ ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయం కూడా సిబిబిఓలు పరిధిలోనే వుంటుంది. ఇలాంటి కొన్ని ఒకే తరహా వ్యవసాయ పంటలు పండించే ప్రాంతాలను ఎంపిక చేసిన తర్వాత సిబిబిఓ రంగంలోకి దిగుతుంది. వ్యవసాయం చేయటం, మొదటి 5 సం॥ల కాలానికి

నిధుల ఏర్పాటు కోసం రిజిస్టరు చేసుకోవటం, ప్రోత్సహించటం, పండించిన పంటలను మార్కెట్‌లో విక్రయించటం, వాస్తవికమైన కొనుగోలుదారులు, ప్రభుత్వ ఏజన్సీలతో ఎల్లవేళలా సంబంధం కలిగి వుండటం చేస్తుంది.

ఇక, చిన్న రైతుల వ్యవసాయ వాణిజ్య కన్సార్టియమ్ (ఎస్ఎఫ్ఏసి) జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌సిడిసి), మరియు 'నాబార్డ్' వంటి సంస్థలు 'అమలు చేసే సంస్థలుగా' వుంటాయి.

క్లస్టర్స్‌ను గుర్తించి, వాటికి నిర్మాణ రూపమివ్వటం, సిబిబిఓల ఎంపిక క్రమాన్ని, 'అమలు చేసే సంస్థలను' జాతీయ ప్రాజెక్టు నిర్వహణా ఏజెన్సీ – ఎన్‌పిఎమ్ఏ నిర్వహిస్తోంది.

ఏమైనా పలు దొంతరలతో కూడిన ఈ ఉన్నత ఆధిపత్య ఏర్పాటుకు రెండు ప్రధాన లక్ష్యాలున్నాయి.

పంట విషయంలో రైతాంగాన్ని నిర్ణయం తీసుకునే క్రమాన్నుండి విడగొట్టటం, ఏ పంట పండించాలో, ఆ పంటను ఎక్కడ అమ్మాలో అనే అంశాల్లో పంట పండించిన రైతుల అదుపేమీ వుండబోదు. స్వతంత్రను కోల్పోయే బంధంలోకి ఎరవేసి రైతాంగాన్ని బంధిస్తున్నారు. విత్తనాల సరఫరా, ఇంకా ఇతర వ్యవసాయ అవసరాలను తీర్చటం వంటి చర్యలతో ప్రభుత్వ సహాయం, మద్దతు తమకు లభిస్తుందేమోనని, భారీస్థాయిలో ఆర్థికాన్ని వెచ్చించి, ఉత్పత్తి అధికం చేయటానికి తోడ్పడుతుందేమోనని, రైతాంగానికి భ్రమలు గొల్పుతున్నారు.

రెండో లక్ష్యం ప్రధానమైనది. ఎఫ్‌పిఓల పరిధిలోనున్న 600 ఎకరాల చొప్పున భూములలో పండిన పంటలనంతా వ్యవసాయ వాణిజ్య గుత్తసంస్థల అధీనంలో వుంచుతారు. 'ఒక జిల్లా ఒకే ఉత్పత్తి' అనే నినాదం దీనిలో భాగమే. ఒక జిల్లా పొద్దుతిరుగుడు పంట పండిస్తే, మరొక జిల్లా ఆవాలు, మరొకరు బంగాళదుపంలో లేదా సేంద్రియ వరి, పూలు పండిస్తారు. ఆదాని, దలైమర్, హిందూస్తాన్ లివర్, పెప్సి, నెస్లే, మొదలైన వ్యవసాయ వాణిజ్య గుత్తసంస్థలకు, ఎఫ్‌పిఓలు పండించిన పంటలను వారి అవసరాల కనుగుణంగా కాంట్రాక్టుగా అమ్మివేయటం జరుగుతుంది. టోకు ధరల ప్రకారం తక్కువ ధరలకే వారు విత్తనాలను కూడా రైతులకు సరఫరా చేయవచ్చు. ఈ విధానాల అమలు సంస్థల ఆర్థిక సహకారానికి తమ శ్రమను జోడించి, ఆ కంపెనీలకు కావలసిన పంటను పండించటమేగాకుండా, వాటిని శుద్ధి చేసే క్రమంలో కొన్ని పనులైన – శుభ్రంచేయటం, నాణ్యమైనవి వేరు చేయటం, ప్యాకింగ్ చేయటం – వంటివి కూడా ఎఫ్‌పిఓలలో రైతులే చేయటం జరుగనుంది. అలాగే పొలాల వద్దే యూజర్ ఛార్జీలు చెల్లిస్తే వినియోగదారునికి సరసమైన, చౌక ధరలకే పంటలను అందిస్తామంటున్నారు. బడా వ్యవసాయ పరిశ్రమదారులైన అదానీ, హిందుస్థాన్‌లివర్, ఫ్రిటో–లె, పెప్సి, నెస్లే వంటి బడా వ్యవసాయ వాణిజ్య కంపెనీలతో పాటుగా బడా మాల్స్ చేతుల్లో రైతాంగం చిక్కుకుపోతారు.

బిజెపి అనుబంధ కిసాన్ మోర్చా ఇప్పటికే చాలా చురుగ్గా రైతాంగాన్ని ఈ గ్రూపులోకి సమీకరించి సమూహాలుగా ఏర్పాటు చేస్తూనే, మరోవైపున తామెంచుకున్న బడా వ్యవసాయ వాణిజ్య కంపెనీలతో సిబిబిఓలను అనుసంధానం చేసుకుంటున్నారు. పేద, సన్నకారు, మధ్యతరగతి రైతులను, వారికి కొద్దిపాటి భూమి మాత్రమే కలిగివున్నా, తాము లాభాలు సంపాదించు కోగలుగుతామంటూ భ్రమలపాలు చేస్తున్నారు. అయితే పాలకుల కుట్రను బహిర్గతం చేయటం ద్వారా, బడా వ్యవసాయ వాణిజ్య కంపెనీలకు దాసోహం చేయటం నుండి బయట పడవేయాలి.

నీలిమందు వ్యాపారులు రైతాంగాన్ని నీలిమందు పండించమని కోరతారు. ఆ క్రమం ద్వారా రైతులు తమకు నచ్చిన, తమకు అవసరమైన పంటను పండించుకునే స్వేచ్ఛను కోల్పోవటమేగాక, పలువిధాల మోసానికి గురవుతారు. ఈ కుటిల పథకం ద్వారా ప్రజాధనాన్ని, ఈ అమలు సంస్థల ద్వారా పంటల కొనుగోలుదారు అయిన వ్యవసాయ వాణిజ్య కంపెనీలకు కట్టబెట్టటమే జరుగుతుంది. శుద్ధి చేయటం, నాణ్యతల ప్రకారం గ్రేడింగ్ చేయటం, వర్గీకరించటం వంటి పనుల ద్వారా చాలా పెద్ద మొత్తంలో రైతాంగ శ్రమకు విలువ నిరాకరించబడుతుంది. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్‌లో టమోటా, బంగాళదుంప పండించే రైతులు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ కుట్రపూరిత విధానాలను అన్ని శక్తులూ ఒడ్డి వ్యతిరేకిద్దాం. సన్న, చిన్నకారు రైతాంగాన్ని మోసగించటాన్ని వెంటనే నిరోధించాలి. ఈ కుటిల విధానానికి వ్యతిరేకంగా ప్రజలనంతా ఐక్యం చేసి నిలబెట్టాల్సిన ఆవశ్యకత ఎంతగానో వుంది.

★★★★★